# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- స్వదేశీ పరిజ్ఞానంతో ఆహారభద్రత సాధించడం అత్యంత కీలకమని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ అన్నారు.
- భారత్-రష్యాల మధ్య ఆర్థిక సహకారం, వాణిజ్యం, ఇంధన రంగాలలో భాగస్వామ్యం బలంగా పెరుగుతోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30న ప్రసారమవుతుంది.
- ఛత్తీస్‌గఢ్, బీహార్, ఒడిశా, తూర్పు మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని రేపు అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది.

==========================

స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత సాధించడం అత్యంత కీలకమని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా ముసునూరులో గౌర్మెట్ పాప్‌కార్న్ సంస్థ రూపొందించిన నూతన మొక్కజొన్న వంగడాన్ని ఉపరాష్ట్రపతి ఈరోజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ... వ్యవసాయ ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఇది ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. రైతులు మొక్కజొన్న సాగు చేస్తూ.. మంచి లాభాలు ఆర్జిస్తున్నారని, అంతర్జాతీయ మార్కెట్ కు ఎగుమతి చేసే స్థాయికి పాప్‌కార్న్ ఎదుగుతుందని తెలిపారు. నదుల అనుసంధానంతో అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీరు అందుతుందని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్-రష్యా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. రష్యా పర్యటనలో భాగంగా జైశంకర్ ఈరోజు క్రెమ్లిన్‌లో రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిశారు. భారత్-రష్యా సంబంధాలను బలోపేతం చేయడం, కీలక రంగాలలో సహకారాన్ని విస్తరించడంపై ఇరు దేశాల నాయకులు చర్చించారు. ఈ సమావేశంలో ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక సహకారం, రాబోయే ఉన్నత స్థాయి శిఖరాగ్ర సమావేశాల సన్నాహాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... రెండు దేశాలు నిర్వహించిన అంతర ప్రభుత్వ కమిషన్ల సమావేశం ఫలితం సానుకూలంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక సహకారం, వాణిజ్యం, ఇంధన రంగాలలో భారత్-రష్యా భాగస్వామ్యం బలంగా పెరుగుతోందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఈనెల 27వ తేదీన దేశ వ్యాప్తంగా `ఖేలో ఇండియా సంవాద్ - ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్` కార్యక్రమాన్ని నిర్వహించనుంది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా 1,500కి పైగా ప్రదేశాలలో యువత, క్రీడాకారులు, విద్యా సంస్థలను ఒకచోట చేర్చనున్నరాని ఆ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృశ్యమాధ్యమ విధానంలో పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగిస్తారని ఒక ప్రటనలో ఈరోజు తెలిపారు. క్రీడాభిమానులైన యువతకు, భారతదేశ విధాన రూపకర్తలకు మధ్య ప్రత్యక్ష సంభాషణను నెలకొల్పడానికి, అలాగే యువత తమ ఆలోచనలు, అనుభవాలు, సూచనలు పంచుకోవడానికి అవకాశం కల్పించేందుకు ఈ కార్యక్రమం ఒక ప్రధాన ప్రయత్నమని అన్నారు. క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడం, 2036 ఒలింపిక్స్ కోసం ప్రతిభను పెంపొందించడం, పాలనలో యువత భాగస్వామ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యాలని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 137వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భూమి పునరుద్ధరణకు మద్దతు ఇవ్వడానికి, కరువును తట్టుకునే సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి వైవిధ్యభరితమైన, నిరంతర అంతర్జాతీయ ఆర్థిక సహాయం అవసరమని భారతదేశం స్పష్టం చేసింది. మంగోలియాలోని ఉలాన్‌బాతర్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి ఎడారీకరణ నిరోధక సదస్సు (UNCCD) 17వ కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్ (COP-17) సమావేశంలో “ఆరోగ్యకరమైన భూమి, కరువును తట్టుకునే సామర్థ్యం కోసం వినూత్న ఆర్థిక యంత్రాంగాలు” అనే అంశంపై జరిగిన మంత్రివర్గ చర్చలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భూ పునరుద్ధరణ అనేది ఒక ఖర్చు కాదని, అది ఆహారం, నీరు, జీవవైవిధ్యం, జీవనోపాధి, దీర్ఘకాలిక స్థితిస్థాపకతలో పెట్టే పెట్టుబడి అని అన్నారు. ఎడారీకరణ, భూక్షయం, కరువులను పెద్ద ఎత్తున పరిష్కరించడానికి ప్రభుత్వ బడ్జెట్లకు అతీతంగా వైవిధ్యభరితమైన, ఊహించదగిన, నిరంతర ఆర్థిక వనరులతో పాటు, బలమైన ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు కూడా అవసరమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి సంస్థల క్రమబద్ధీకరణ (PMFME) పథకం ద్వారా 2 లక్షలకు పైగా వ్యక్తిగత సూక్ష్మ ఆహార శుద్ధి సంస్థలు లబ్ధి పొందాయని కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన PMFME సదస్సులో ఆయన మాట్లాడుతూ... మొత్తం లబ్ధిదారులలో సుమారు 80 శాతం మంది మొదటి తరం పారిశ్రామికవేత్తలు కాగా, వారిలో 44 శాతం మంది మహిళలు ఉన్నారని తెలిపారు. 2020లో ప్రారంభించిన ఈ పథకం 10 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధిని కల్పించిందన్నారు. రైతులకు ఆర్థిక సాధికారత కల్పించడంలో ఆహార శుద్ధి ప్రక్రియ కీలకమని కేంద్రమంత్రి పేర్కొన్నారు. వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లను తెరుస్తున్నాయని ఆయన చెప్పారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ఎంతో మంది జీవితాలను మార్చిందని, దీని ద్వారా వారు తమ ఉత్పత్తులను భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో కూడా విక్రయించగలుగుతున్నారని చిరాగ్ పాశ్వాన్ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 15 ట్రిలియన్ డాలర్ల జీడీపీ వాటా ఉన్న దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. జపాన్ లోని టోక్యోలో జరిగిన జపాన్ ఇండియా బిజినెస్ కన్సల్టేటివ్ కమిటీ రౌండ్-టేబుల్ సమావేశానికి కేంద్రమంత్రి హాజరయ్యారు. ఈ సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... భారతదేశ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ప్రపంచ వాణిజ్యంలో సుమారు 75 శాతాన్ని కలిగి ఉంటాయని, ప్రపంచ విలువ గొలుసులలో భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా నిలపడానికి ఇవి సహాయపడతాయని తెలిపారు. భారతదేశానికి పెద్ద దేశీయ మార్కెట్ ఉందని, గత నాలుగేళ్లలో తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసి ప్రపంచానికి మార్గాలను తెరిచిందన్నారు. దేశంలో డేటా సెంటర్లు, తయారీ రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. పెరుగుతున్న ఆర్థిక సంబంధాలు భారత్, జపాన్‌ల మధ్య సమతుల్య వాణిజ్యానికి దోహదపడాలని పేర్కొన్నారు. 2047 నాటికి భారతదేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా లక్ష్యంగా పెట్టుకుందని పీయూష్ గోయల్ వెల్లడిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్, బీహార్, ఒడిశా, తూర్పు మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని రేపు అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) తెలిపింది. ఆయా ప్రాంతాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =